

పద్మశ్రీని సన్మానించి రికార్డు అందజేస్తున్న పద్మశ్రీ డా.శోభారాజు, హైమావతి భీమన్న,

ఆకట్టుకున్న నవరాగం- స్వరయాగం

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కుమారి రుగ్వేదం పద్మశ్రీ శనివారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన నవరాగం- స్వరయాగం కార్యక్రమం ఆకట్టుకుంది. చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలి యువ మహిళా రాగావధానిగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌కోసం నిర్వహించిన ఈ ఫీట్ విజయవంతంగా సాగింది. పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు రాగావధానం ద్వారా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డా.శోభారాజు, ప్రముఖ గాయని హైమావతి భీమన్న పాల్గొని పద్మశ్రీని సన్మానించారు. నిర్వాహకులు చిమ్మపూడి శ్రీరామమూర్తి, పులిగడ్డ విజయలక్ష్మి, ముక్తేవి భారతి, శశికళాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో ఉగాదిపురస్కారాల ప్రదానసభ ఘనంగా జరిగింది. వివిధరంగాల ప్రముఖులు పి. కృష్ణమూర్తి, శ్రీనివాస్‌శర్మ, గోపాలకృష్ణ, కృష్ణారెడ్డిలకు నిర్వాహకులు భారతీ కమలాకర్ పర్యవేక్షణలో అతిథులు ఉగాది పురస్కారాలు బహూకరించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం పూర్వ ఛైర్మన్ పి.విజయబాబు మాట్లాడుతూ వివిధ రంగాలవారిని ఒకే వేదికపైకి తెచ్చి వారికి పురస్కారాలు ఇచ్చి వారి ప్రతిభను నలుగురికి తెలియజేయడం విశేషం అన్నారు. కార్యక్రమంలో రచయిత మరుమాముల వెంకటరమణశర్మ, టి.గౌరీశంకర్, చేబియ్యం రామకృష్ణ, జీవీఎల్ నరసింహారావు, భారతీ కమలాకర్, లలితపరమేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేయొద్దు

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ చేయొద్దని జస్టిస్ బి.చంద్రకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఓర్సు ఇంద్రసేనా అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి అధిక మొత్తం లో బడ్జెట్ కేటాయించాలన్నారు. హెచ్‌సీయు భూములను తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి, ప్రొ.వినాయకరెడ్డి, ఒంగూరు నరసింహ, మల్లేష్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.



గోల్నాక చౌరస్తాలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన ఎమ్మెల్యే కాలేరు వెకటేష్, అంబర్‌పేట, నల్లకుంట కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, వై.అమృత తదితరులు



గోల్నాక చౌరస్తాలో నివాళ్లు అర్పించిన బాగ్అంబర్‌పేట మాజీకార్పొరేటర్ పద్మావతిడిపిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులు



రంగానగర్‌లో బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

దేశ తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో ఘనంగా జరిగాయి. రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను నేతలు కొనియాడారు. ఆయన ఆశయాల కొనసాగింపునకు పాలకులు పాటుపడాలని కోరారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, మాజీ ఎం.పి.వి.హనుమంతరావు, కార్పొరేటర్లు ఇ.విజయకుమార్‌గౌడ్, వై.అమృత, కార్పొరేటర్ దూసరి లావణ్య, జి.రచనశ్రీ, ఎ.పావని, కె.రవిచారి, బి.పద్మావెంకటరెడ్డి, మాజీకార్పొరేటర్ కె.పద్మావతిడిపిరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **- ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల జోన్‌బృందం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి)**



నాగమయ్యకుంటలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, సురేందర్, హరీష్, జ్ఞాని తదితరులు



ముషీరాబాద్‌లో నివాళులర్పించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌యాదవ్, కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్



సిటీసెంట్రల్ లైబ్రరీలో నివాళులర్పిస్తున్న లైబ్రరీ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, లైబ్రరీ ఉద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు



టీడీపీ నగర కార్యాలయంలో నివాళులర్పించిన ఆ పార్టీ నగర అధ్యక్షుడు పి.సాయిబాబా, కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్



అరుంధతినగర్ బస్తీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్



వివేక్‌నగర్ బస్తీలో పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా సెక్రటరీ జనరల్ యాదగిరిగౌడ్



ముషీరాబాద్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ తదితరులు



హరినగర్‌లో వేసి నివాళులర్పించిన రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు



నగరంలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు



బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన విక్రమ్‌నగర్ యూత్ అసోసియేషన్



బాగ్అంబర్‌పేటలో నివాళులర్పించిన ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కృష్ణగౌడ్, తదితరులు

పదిరోజుల నుంచి తగ్గిన తాగునీటి సరఫరా

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గాంధీనగర్ డివిజన్ వాల్మీకినగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, వీవీ గిరినగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 4.30గంటలకు తాగునీరు వదలాల్సిన లైన్‌మెన్‌లు ఉదయం 6 గంటల వరకు కూడా తాగునీరు ఇవ్వడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం 4.30 గంటలకు హాస్టళ్ల, అపార్ట్‌మెంట్‌లు ఉన్న ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసి ఆరు గంటలకు తమకు నీరు వదలడంతో సరిపోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హాస్టళ్ల నిర్వాహకులు, అపార్ట్‌మెంట్ మెయిన్‌టెన్ సభ్యుల నుంచి మామూళ్లు తీసుకుని నల్లా వచ్చిన రోజు వారికే నీటిని సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వాల్మీకినగర్, వీవీ గిరినగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌వాసులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. వాటర్‌బోర్డ్ డీజీఎం, మేనేజర్‌లు పరిశీలించి నీటి సరఫరాను మెరుగుపర్చాలని కోరారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

అంబర్‌పేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ద్విచక్రవాహనాన్ని వేగంగా నడిపి వాహనంపై నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ డి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉండే చింటూ(33) పెయింటర్. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 1వ తేదీ రాత్రి చింటూ మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ అలీకేఫ్ చౌరస్తా సమీపంలోని వాటర్‌వర్క్స్ గేటు వద్ద జారిపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసును ఎస్ఐ తరుణ్ దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు .. ఆటో సీజ్

ముషీరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు రెడ్‌హ్యాండ్‌గా పట్టుకొని శనివారం అరెస్టు చేశారు. ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాలప్రకారం చిలకలగూడకు చెందిన మహ్మద్ సమీద్(25), బోయిగూడకు చెందిన బి.కుషాల్ (25), వీరు ఇద్దరు నాగ్‌పూర్ నుంచి పొడి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, కానిస్టేబుల్స్ బోయిగూడ ముషీరాబాద్‌లోని సాయిధరణి అపార్టుమెంట్ సమీపంలో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా వీరు ఇద్దరూ ఆటోలో 1.2కిలోల పొడిగంజాయిని తీసుకుని అనుమానాస్పదంగా వెళ్తున్నారు. వారిని గమనించి ఆటోను ఆపి తనఖీ చేయగా 1.2 కిలోల గంజాయి లభించింది. ఇద్దరినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. గంజాయిని తీసుకువచ్చిన ఆటోను సైతం సీజ్ చేశామని ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు.

రైలు కింద పడి కారుడ్రైవర్ ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి కారు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ఎస్‌కే.ఖాజా(31) కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విద్యానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్ నేత ఎర్రం శేఖర్‌కు మాతృవియోగం

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఎస్సీ సెల్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శేఖర్ మాతృమూర్తి ఎర్రం లక్ష్మీబాయి(78) శనివారం తెల్లవారుజామున 2 మృతి చెందారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు అక్కడికి వెళ్లి నివాళులర్పించారు. ఆమె అంత్యక్రియలు సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో జరిగాయి.

శ్రీరామనవమికి దేవాలయాలు ముస్తాబు

కవాడిగూడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి రామాలయాలు, హనుమాన్ దేవాలయాలయాలు ముస్తాబయ్యాయి. కవాడిగూడ డివిజన్‌లోని శనివారం కొత్తబజార్ సంకట విమోచన హనుమాన్ దేవాలయం, కామునికంతలోని బాలాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. దోమలగూడ హనుమాన్ దేవాలయాన్ని సీతారాముల కల్యాణం కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుత్ దీపాలు. పెద్దపెద్ద షామియానాలు ఏర్పాటుచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో తెలపారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయంలో జరిగే ఏర్పాట్లను దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం కల్యాణమండపం ఎదుట ఏర్పాటు చేసిన చలువ పందిరి

నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం

ముషీరాబాద్: శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. భోలక్‌పూర్ మహాత్మానగర్‌లో అభయాంజనేయస్వామి సహిత నవగ్రహం దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ తెలిపారు. పద్మశాలీ కాలనీలోని సంజీవ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతామార్కండేయ, పుండరీకం, సీనియర్ నాయకులు తెలిపారు.

● **చిక్కడపల్లి:** ఆదివారం జరిగే శ్రీరామనవమి వేడుకలకు చిక్కడపల్లిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11.30 గంటలకు సీతారామకల్యాణం జరుగుతుందని ఈవో అన్నపూర్ణ, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్ తెలిపారు. బాగ్‌లింగంపల్లి షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు జయప్రదం చేయాలని ఆలయ వ్యవస్థాపక వైస్‌ఛైర్మన్ గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎన్.ధర్మరాజుగౌడ్ కోరారు.

ప్రత్యేక పూజులు, హోమాలు

రాంనగర్: శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఆలయాలు, సంఘాల ఆధ్వర్యంలో శనివారం పూజలు, సేవాకార్యక్రమాలు జరిగాయి. రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సుదర్శన, మృత్యుంజయ హోమం, లలిత సహస్రనామ పారాయణం, 70 సంవత్సరాలు దాటిన 12 జంటలకు పాదపూజలు, మెహందీ, మంగళస్నానాలు నిర్వహించారు. రాంనగర్ రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా సుదర్శన తదితర పూజలు జరిగాయి. శ్రీసీతారాముల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. విద్యానగర్‌లోని శివం ఆలయంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్‌ఆధ్వర్యంలో శనివారం శ్రీసీతారాముల పల్లకీ సేవ నిర్వహించారు.

దోషం పోగొడతానని లెక్చరర్‌కు బురిడీ

● బాబాకు నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.7లక్షలు ముట్టజెప్పిన మహిళ

● వేధింపులు భరించలేక కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భర్త చనిపోవడం, కుటుంబ పరిస్థితులు అంత సరిగా లేకపోవడంతో ఇంటి దోషాన్ని పోగొట్టుకోవడానికి ఓ మహిళా లెక్చరర్ బురిడీ బాబాను ఆశ్రయించింది. ఇదే అదనుగా భావించిన ఆ దొంగ స్వామి అందినకాడికి దోచుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం... తిలక్‌నగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ భర్త దిల్‌సుఖ్ నగర్‌లో ఓ జూనియర్ కళాశాలలో లెక్చరర్. గత సంవత్సరం ఆయన మృతి చెందగా, కారుణ్య నియామకం కింద ఆమెకు అదే కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ కళాశాల ప్రిన్సిపాల్ గత మార్చిలో 'ఏదైనా ఇంటి దోషం పోవాలంటే, ఎల్బీనగర్‌లో నివాసం ఉండే శివస్వామికి చెప్పుకోవాలి. దీంతో దోషాలన్నీ తొలగిపోతాయ్' అని నమ్మించి, శివస్వామిని లెక్చరర్‌కు పరిచయం చేసింది. ఆమె ఇంటికి వచ్చి దోష నివారణకు శివస్వామి పూజలు చేయించడం మొదలుపెట్టాడు.

పెద్ద దోషం ఉన్నందునే..

పెద్ద దోషం ఉన్నందునే 'మీ భర్త చనిపోయాడు' అని, పూజల కోసం రూ.లక్షా70 వేల నగదు తీసుకున్నాడు. తరువాత ఆమెను కనకదుర్గ ఆలయానికి తీసుకెళ్లి పూజలు చేయాలని 20 తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడు. 'నీ పూజల వల్ల ఆలయ పూజారి చనిపోయాడు' అని భయపెట్టి ఆమె ఇంటి డాక్యుమెంట్లను తీసుకున్నాడు. తెలుసుకున్న బాధితురాలి కుమార్తె.. తల్లిని వెంట తీసుకొని శివస్వామి వద్దకు వెళ్లింది. పూజలు మంత్రాలు వద్దని తమ ఇంటి డాక్యుమెంట్లు ఇవ్వాలని అడగ్గా, ఆ డాక్యుమెంట్లను ఇచ్చి, నగదు, బంగారం ఇవ్వలేదు. ఈ మేరకు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ నెల 3న శివస్వామిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు చేస్తారని బీజేపీ ఓబీసీ మోర్చా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ హెచ్చరించారు. శనివారం కాచిగూడ మహేంద్రగార్డెన్‌లో ఓబీసీ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అనేక హామీలు ఇచ్చినా ఏదీ ఆచరణకు నోచుకోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా సెంట్రల్ ప్రధానకార్యదర్శి అచ్చిని రమేష్, నాయకులు ఎస్.నర్సింగ్‌రావు, కిషోర్‌కుమార్, ప్రకాష్‌సింగ్, ఆవుల నరేష్, మధు, రవీందర్, ఆనంద్ పాల్గొన్నారు.

నల్లకుంట సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

నల్లకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం డివిజన్‌లోని మయూరీ స్ట్రీట్ లైన్ 4 వీధిలో రూ.9 లక్షలతో సీవరేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. డివిజన్‌లో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

8న తెలుగు భాషా సదస్సు

నల్లకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా చైతన్య సమితి వార్షికోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్ తెలిపారు. తెలుగు భాషకు పట్టాభిషేకం శీర్షికన నిర్వహించే ఈ వేడుకల్లో అంతర్జాతీయ కవి సమ్మేళనం, అంతర్జాతీయ తెలుగు భాషా సదస్సు ఉంటాయన్నారు. నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయగానసభలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ చంద్రమౌళి, జయప్రకాష్, మహమ్మద్ అబ్దుల్ సాహీద్, సురేష్, ఎడ్ల కల్లేష్, జగన్, సత్యనారాయణ, మండల గురునాథం, పెబ్బేటి మల్లికార్జున్, అవ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే 1న రవీంద్రభారతిలో శ్రమశక్తి అవార్డులను బహూకరిస్తోందని కార్మికశాఖ జంటనగరాల సంయుక్త కమిషనర్, నోడల్ అధికారి సునీతాగోపాల్ దాస్ తెలిపారు. కార్మికరంగానికి తమవంతు విశిష్టమైన సేవలు అందిస్తున్న కంపెనీలు, ఫ్యాక్టరీలు, సంస్థల మేనేజ్‌మెంట్లు, ట్రేడ్‌యూనియన్ లీడర్లు, కార్మికులు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

'ఆధునిక కాలంలో పద్యాన్ని ఆదరించాలి'

చిక్కడపల్లి: ఆధునిక కాలంలో పద్యాన్ని ఆదరించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సాహితీవేత్త డా.కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పద్య సారస్వత పీఠం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో అవుసుల భానుప్రకాశ్ సంపాదకత్వంలో వెలువడిన పద్యవైభవం సంకలన ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పద్యాన్ని బతికిస్తే భాష సజీవంగా ఉంటుందన్నారు. ఆచార్య టి.గౌరీశంకర్, ఆచార్య ఫణీంద్ర, రంగాచారి, మృత్యుంజయశర్మ, దత్తాత్రేయశర్మ, విజయకుమార్ పాల్గొన్నారు.

నాటి ఆంధ్ర పాలకుల బాటలో నేటి తెలంగాణ పాలకులు

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి కేటాయించడం అన్యాయం, అక్రమం అని పలువురు వక్తలు ఆరోపించారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అణచివేత చర్యలను నిలిపివేయాలని డిమాండ్‌చేశారు. శనివారం ఎస్వీకేలో డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్, డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నాటి ఆంధ్రపాలకుల బాటలో నేటి తెలంగాణ పాలకులు నడుస్తున్నారని ఆరోపించారు.